క్లుప్తంగా

వైభవంగా ఊంజల్ సేవ



నాగలాపురం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదానారాయణ స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊయలలో కొలువుదీర్చి ఊంజల్ సేవను వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శ్రీనివాసులు, షరాబ్ ఉదయకుమార్, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

నారాయణవనం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు చిత్రలేఖన, ఆటల పోటీలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీవీఎస్ శర్మ పోటీలను పర్యవేక్షించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితంలో దినచర్యగా మార్చుకుంటే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో సెల్ ఫోన్లకే పరిమితం కాకుండా గ్రంథాలయాలను సందర్శించాలని కోరారు. హెచ్‌ఎంలు సులోచన, శశికళ, లైబ్రేరియన్ జీవన్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల చివరి రోజున ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అందజేస్తామని జీవన్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల విద్యాకమిషన్ ఆదేశాల మేరకు పుత్తూరు డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుజన, శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు మాలతి గాబ్రియేల్ ఆధ్వర్యంలో అన్ని విభాగాల్లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ మురళి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాల సేవలో కల్యాణ వెంకన్న



నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులకు ఊయ్యాల సేవను నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కావడంతో శనివారం ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామిని అధిష్టింప చేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయ్యాల సేవలో ఉత్సవమూర్తులను భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కార్మికులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో శనివారం సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల చుట్టూ ఉన్న ముళ్లపొదలను తొలగించి, డ్రైనేజీ కాలువల్లోని మురుగును కార్మికులు తొలగించారు. వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధికాకుండా నివారణ మందు పిచికారీ చేయించారు.

పట్టణ ప్రజలకూ రూ.పది లక్షలకు పైగా లబ్ధి



ఐరన్ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 32వ పరిధిలోని బాలాజీనగర్, దర్గామిట్ట, రెవెన్యూ కాలనీ, అగ్రహారం, పానగల్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. సంక్షేమ ప్రధాన జగనన్న సంక్షేమ ఫలాలు పట్టణంలోని పేదలకు కూడా అందాయన్నారు. గ్రామాల్లో పేదవారికి కుటుంబానికి రూ.10 లక్షలు సాయం అందిందన్నారు. కానీ పట్టణంలోని కొంతమంది పేదలకు కూడా జగనన్న సంక్షేమ పథకాల ద్వారా రూ.10 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. జగనన్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు వివరిస్తూ ప్రతి ఇంటికి వెళ్లారు. అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారి వివరాలు సేకరించి వారికి వెంటనే పథకాలు అందించాలని ఆదేశించారు. వార్డుకు విచ్చేసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఆలయ పాలక మండలి సభ్యుడు మున్నారాయల్, రవి, సురేష్, హరి, తిరకాల మల్లికార్జునగౌడ్, సెన్నీరుకుప్పం శేఖర్, గోపాల్‌నాయుడు, హరినాయుడు, రాకేష్, అరవింద్‌రెడ్డి, ప్రసాద్, ఢిల్లీబాబు, రఘు తదితరులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. క్రేన్‌తో పూలమాలను వేసి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జనార్దన్ జే పవార్, పగడాల రాజు, ముత్యాల పార్థసారథి, వయ్యాల కృష్ణారెడ్డి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కార్గో ఉచిత డోర్ డెలివరీ సేవలు



సత్యవేడులో ఆర్టీసీ కొరియర్ ఉచిత సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సత్యవేడు: ఆర్టీసీ సంస్థ అందిస్తున్న 'ఉచిత కొరియర్ డోర్ డెలివరీ' సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యవేడు డిపో మేనేజర్ వెంకటరమణ కోరారు. కార్గో సేవల మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం ఆర్టీసీ అధికారులు, సిబ్బంది గాంధీరోడ్డు, నేతాజీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. డీఎం మాట్లాడుతూ కార్గో సేవలు మరింత చేరువగా తెచ్చేందుకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. 50 కిలోల బరువుతో బుకింగ్ చేసిన పార్శిల్ కొరియర్లను ఇంటి వద్దకే చేర్చనున్నట్లు వివరించారు. కౌంటర్ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఉచిత సేవలు అందిస్తామన్నారు. పార్శిల్ బుక్ చేయడానికి వినియోగదారులకు నగదు రహిత డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. పార్శిల్ బుక్ చేసిన తర్వాత ఆ వస్తువు ఎక్కడుందో తెలుసుకోవడానికి ట్రాకింగ్ సిస్టం ఉందన్నారు. 12 టన్నుల వరకు సరుకు రవాణా చేయడానికి కిలోమీటర్ ప్రాతిపదికన ప్రైవేటు రవాణా చార్జీల కన్నా తక్కువ ధరలకు కార్గో వాహనాలను అద్దెకు ఇస్తున్నామన్నారు. కార్గో ఏజెంట్‌గా చేరడానికి ఆసక్తి ఉన్న వారికి మండల పరిధిలో రూ.1000, మున్సిపాలిటీ పరిధిలో రూ.2500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ పీఆర్ మూర్తి, డీఎస్ వర్మ, ఏఎంఎఫ్ శ్రీనివాసులు, డిపో సెక్రటరీలు వి.బాబు, ఎంఎస్ బాబు, వెంకటేశ్వర్లు, ఆర్.జయకుమార్, గ్యారేజ్ సెక్రటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ గ్యారేజ్ నగర్ ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్‌నాయకులు

శ్రీకాళహస్తి: ప్రత్యేక మెకానికల్ ఇంజినీరింగ్ గ్యారేజీ నగర్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని వైఎస్ఆర్ సీపీ కార్యాలయంలో ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ తమకు పది ఎకరాల స్థలంలో గ్యారేజీ నిర్మించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మోహన్‌గౌడ్, మునిగోపాల్, సాధిక్‌బేగ్, సుబ్రహ్మణ్యం, తిరుపాల్‌రెడ్డి, సురేషకుమార్, రవి, మూర్తి పాల్గొన్నారు.

ఆశ్ర పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా వినిమోగదారుల సంస్థ ఆశ్ర(అడ్వొకేట్ అసోసియేషన్ ఫర్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్) ఐదో జాతీయ సదస్సు ఈనెల 24న ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు, అడ్వొకేట్ అరికింబేడు మునిశేఖర్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో భక్తులకు, వినియోగదారుల హక్కులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవగాహన కల్పించాలన్నారు. సదస్సు విజయవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమలో పురుషోత్తంగౌడ్, అల్తాఫ్, మునిశంకర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థలో కోలాహలంగా ఫ్రెషర్స్ డే



సమావేశంలో మాట్లాడుతున్న అశోకరాజు

నారాయణవనం: సిద్ధార్థ వృత్తి విద్యా కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే కోలాహలంగా నిర్వహించారు. ఆడిటోరియంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు జ్యోతి ప్రజ్వలనతో డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరిన విద్యార్థుల ఫ్రెషర్స్ డే ఘనంగా సాగింది. అశోకరాజు మాట్లాడుతూ వృత్తి విద్యలో సంకల్ప బలంతో పట్టుదలగా కృషి చేస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ కృషి, పట్టుదల, అంకిత భావంతో ఉన్నతశిఖరాలను చేరుకునేందుకు యువ ఇంజినీర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపల్స్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విద్యార్థులు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక విద్యపై విద్యార్థులు శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్‌సత్యనారాయణ, హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఏర్పేడు: శాస్త్ర సాంకేతిక విద్యపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఓపెన్ స్కూల్ డే నిర్వహించారు. ఐఐటీ పరిసర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల నుంచి 250 విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఉల్లాస్ ట్రస్ట్ కెరీర్ గైడెన్స్‌సెషన్స్‌తో కార్యక్రమం ప్రారంభమైంది. విద్యార్థులు ఐఐటీలోని అకడమిక్, రీసెర్చ్ కార్యకలాపాలను తిలకించారు. అలాగే ప్రయోగశాలలు, అత్యాధునిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, క్యాంపస్‌లను సందర్శించారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన, సుసంపన్నమైన అనుభవాన్ని అందించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. విద్యార్థులు ఉన్నత విద్య కోసం అందుబాటులోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు మరిన్ని ప్రయోగాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ ఎన్ఎస్‌మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్యాకల్టీ అడ్వైజర్ దేబాశిష్ మోండల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మహేష్ కుమార్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



జ్ఞాపికలతో విద్యార్థులు

శ్రీకాళహస్తి: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పట్టణంలోని తెలుగుగంగ గిరిజన బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి అన్నారు. జిల్లాస్థాయి ఆటల పోటీలు, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను తిరుపతి జిల్లా స్థాయిలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం నిర్వహించారు. విజేతలకు ఈఎంఆర్ఎస్ కొడవలూరు ఐటీడీఏ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నాగసుబ్బారెడ్డి, ఈఎంఆర్ఎస్ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ



బీమా నగదు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామపంచాయతీ పరిధి దళితవాడకు చెందిన చెంగమ్మ కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేశారు. ఇటీవల చెంగమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో బీమా సొమ్ము రూ. 10 వేలు గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ రాంబాబు మృతురాలి కుమారుడు సికింధర్‌కు శనివారం అందజేశారు. వైఎస్ఆర్ బీమా పథకంలో లక్ష రూపాయలు బీమా వస్తుందని చెప్పారు. అందులో అంత్యక్రియలకు రూ.10 వేలు పోను, మిగిలిన రూ. 90వేలు నామినీ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి: కేవీబీపురం మండలం కాట్రపల్లి రెవెన్యూలో ప్రభుత్వ భూములను కాపాడాలని శనివారం సీపీఐ నాయకులు, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని కార్యాలయంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది ప్రభుత్వ భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వాటిని కాపాడి పేదప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్వీట్ బాక్స్‌లు అందజేస్తున్న సర్పంచ్ గంగాధరం

ఏర్పేడు: మండలంలోని మేర్లపాకలో శనివారం విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని పుష్పిత్ కర్మాగారం సీఈఓ బలరాంరెడ్డి ఆదేశాల మేరకు పరిసర ప్రాంతాల్లోని 150 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, స్వీట్ బాక్స్‌లు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా అభివృద్ధి, సేవాకార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీ. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధరం, ఎంపీటీసీ భరత్‌కుమార్, కంపెనీ పీఓ సాగర్, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు, శంకరయ్య, నాగరాజు, చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు శ్రీకాళహస్తి మండలం తొండమనాడు గ్రామానికి చెందిన కేశవులు ద్విచక్రవాహనంపై సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి బయల్దేరాడు. మార్గమధ్యంలోని మతకాముడి రోడ్డు సమీపంలో వాహనం అదుపు తప్పడంతో కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వెంకన్న భక్తులకు అన్నదానం



ప్రసాదాలను అందిస్తున్న సిబ్బంది

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన భక్తులకు శనివారం అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నప్రసాదాలను అందజేస్తున్నామని అన్నారు. పుత్తూరుకు చెందిన కృష్ణా గ్రాండ్ హోటల్ యజమాని గత నాలుగు వారాలుగా 50 మంది భక్తులకు భోజనాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నైనారు మధుబాల, బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, తొట్టంబేడు గ్రంథాలయ శాఖల ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనారు మధుబాల, తొట్టంబేడు మండల వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలు అని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రంథాలయానికి కొత్తపుస్తకాలు ఇచ్చారన్నారు. ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, గ్రంథాలయ అధికారులు లావణ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

సృజనాత్మకంగా బోధించండి



విద్యార్థి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: తరగతి గదిలో విద్యార్థులకు సృజనాత్మకంగా బోధన చేయాలని ఎంఈవో రవీంద్రనాథ్ సూచించారు. ఆయన శనివారం మండలంలోని ఎన్‌టీఆర్ నగర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు కలిగిస్తూ, విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేసి వారిలోని సృజనాత్మకతను, ప్రతిభను వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

- తంగేళ్లపాళెం పీఏసీఎస్ ఛైర్మన్ మణి బాబు నాయుడు



సహకార జెండాను ఆవిష్కరిస్తున్న తంగేళ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్ మణిబాబు నాయుడు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): సహకార పరపతి సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తంగేళ్లపాళెం పీఏసీఎస్ చైర్మన్ మణిబాబు నాయుడు అన్నారు. 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా పీఏసీఎస్‌లో శనివారం ఆయన సహకార సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిబాబు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో పరపతి సంఘాలు బలోపేతమవుతాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భక్తవత్సలం, ప్రభాకర్, సీఈవో చిరంజీవి రెడ్డి, సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో ప్రతిభకు గుర్తింపు



ఎంఈఓ హేమమాలినీని సత్కరిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల తదితరులు

పిచ్చాటూరు: జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమంలో పిచ్చాటూరు ఎంఈఓ హేమమాలినీ ప్రతిభ కనబరిచారు. దీంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుబాల, ఎంఈఓకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాకం నాగరాజు, రాసాని, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.